రక్తదానం.. ప్రాణదానం

- ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులోకి బ్లడ్‌బ్యాంకు
- వేసవిలో రక్త నిల్వల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు
- రక్తదానానికి దాతలు ముందుకురావాలని వైద్యుల పిలుపు



రక్తం నిల్వ చేసే ఫ్రీజర్



ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకు

ఆత్మకూరు: వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో రక్తదాతల స్పందన అంతంత మాత్రంగా ఉంటుంది. దీంతో బ్లడ్‌బ్యాంకుల్లో రక్తనిల్వల కొరత నెలకొంటుంది. ఫలితంగా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందక రోగులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఎదురవుతాయి. ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం రోగులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. అలాగే రోడ్డు ప్రమాద బాధితులు వస్తుంటారు. వారికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమవుతుంది. ఇక్కడ ఇటీవల బ్లడ్‌బ్యాంకు సేవలు అందుబాటులోకి వచ్చాయి. యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తే వేసవిలో రక్తనిల్వల కొరతను అధిగమించేందుకు అవకాశం ఉంటుంది.

గత ప్రభుత్వ హయాంలో బ్లడ్‌బ్యాంకు మంజూరు

రక్తదానం ప్రాణదానంతో సమానం..అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను నిలబెట్టేందుకు రక్తం ఎంతో అవసరం. సకాలంలో రక్తం లభించక రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. ప్రధానంగా నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. క్షతగాత్రులను ఆత్మకూరులోని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుంటారు. క్షతగాత్రులతో పాటు రోగులకు శస్త్రచికిత్సలు చేసే సమయంలో రక్తం అత్యవసరమవుతుంది. గతంలో ఇక్కడ బ్లడ్‌బ్యాంకు లేకపోవడంతో నెల్లూరు, గూడూరు, కావలి వంటి సుదూర ప్రాంతాల నుంచి రక్తం తీసుకురావాల్సిన పరిస్థితులు ఉండేవి. ఈ నేపథ్యంలో ఆత్మకూరు, ఉదయగిరితో పాటు వైఎస్సార్ జిల్లా మైదుకూరు, బద్వేల్ నియోజకవర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బ్లడ్ బ్యాంకును మంజూరు చేశారు. ఆస్పత్రిలో భవన వసతిని కల్పించడంతో పాటు బ్లడ్‌బ్యాంకుకు కావాల్సిన పరికరాలను పూర్తి స్థాయిలో సమకూర్చారు. అంతలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో బ్లడ్‌బ్యాంకు ప్రారంభం ఆలస్యమైంది. ఎట్టకేలకు గత నెలలో బ్లడ్‌బ్యాంక్‌ను ప్రారంభించడంతో రక్తనిల్వలు అందుబాటులోకి వచ్చాయి.

ఆస్పత్రిలోనే రక్తసేకరణ

ప్రస్తుతం ఆస్పత్రిలోనే స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చిన దాతల నుంచి రక్తాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 70 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, 36 యూనిట్లను రోగులకు అందజేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ శేషారత్నం తెలిపారు. ప్రస్తుతం బ్లడ్ బ్యాంకులో ఓ పాజిటివ్, బీ నెగిటివ్, బీ పాజిటివ్, ఓబీ నెగిటివ్, తదితర రకాలకు సంబంధించిన 23 యూనిట్ల రక్తం నిల్వ ఉందని చెప్పారు. తొలుత ఆస్పత్రిలో చికిత్స పొందే రోగులకు ప్రాధాన్యత ఇస్తూ రక్తం అందజేస్తున్నట్లు చెప్పారు. ఇతర ఆస్పత్రులకు సంబంధించిన రోగులకు అత్యవసరమైతే అందుబాటులో ఉంటే యూనిట్ రూ.800కు అందజేస్తున్నట్లు తెలిపారు. వేసవిలో రక్తనిల్వల కొరత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు.



రక్తదాతల కోసం ఏర్పాటు చైర్‌బెడ్లు

బాధ్యతగా భావించాలి



రక్తదానం ప్రాణదానంతో సమానం. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న వారికి రక్తదానం చేయడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించాలి. ఆస్పత్రిలో బ్లడ్‌బ్యాంకు అందుబాటులోకి రావడంతో ఇప్పటికే పలువురు యువత స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేస్తున్నారు. వేసవిలో రక్త నిల్వల కొరత ఉన్న నేపథ్యంలో రెండు రోజుల్లో ఆత్మకూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి సహకారంతో 40 యూనిట్ల రక్తాన్ని సేకరించేందుకు భారీ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ శేషారత్నం, సూపరింటెండెంట్, ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి



రక్తాన్ని పరీక్షించే పరికరాలు

ప్రత్యేక వాహనం అవసరం

ప్రస్తుతం బ్లడ్ బ్యాంక్‌లోనే ఓ ప్రత్యేక గదిలో రక్తం సేకరిస్తున్నారు. బ్లడ్‌బ్యాంకుకు అనుబంధంగా రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు అన్ని రకాల సౌకర్యాలు కలిగిన ప్రత్యేక వాహనం, సిబ్బంది అవసరం. అయితే నూతనంగా ఏర్పాటైన ఆత్మకూరు బ్లడ్ బ్యాంక్‌కు ఈ సదుపాయాలు ఇంకా సమకూర లేదు. ఇందుకోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రత్యేక వాహనం, సాంకేతిక సిబ్బంది సమకూరిస్తే మారుమూల గ్రామాల్లోనూ రక్తదాన శిబిరాలు నిర్వహించేందుకు అవకాశం కలుగుతుంది.

క్లుప్తంగా

వేడుకగా సీతారాముల ఉత్సవాలు ప్రారంభం



ఉదయగిరి రూరల్: మండలంలోని బండగానిపల్లె పంచాయతీ పరిధిలోని కృష్ణారెడ్డిపల్లిలో సీతారాముల ఉత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, కలశస్థాపన, మూలవిరాట్, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారాముల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా నాగవరపమ్మ ఉత్సవాలు ప్రారంభం



సంగం: మండలంలోని కొరిమెర్లలోని నాగవరపమ్మ ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత నాగవరపమ్మకు విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యాహవచనం, గోపూజ, రక్షాబంధనం, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మూడ్రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు వడ్లమాని చిన్నకొండస్వామినాయుడు, గడ్డె మాల్యాద్రియాదవ్ దంపతులు కార్యనిర్వాహకులుగా వ్యవహరిస్తున్నారు.

నరసింహస్వామి గ్రామోత్సవం



చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం కొట్టాలులో నరసింహస్వామి గ్రామోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవాల ప్రారంభానికి ముందుగా నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా నరసింహస్వామి చిత్రపటాన్ని పల్లకిపై ఉంచి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



సీతారామపురం: స్థానిక అరుంధతీయవాడలోని ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో నిత్య సహాయ మాత మహోత్సవ మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను చర్చి ఫాదర్ సునీల్‌కుమార్ శనివారం ప్రారంభించారు. తొలిరోజు నాలుగు జట్లు తలపడినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20,116, ద్వితీయ బహుమతిగా రూ.10,116 నగదు అందజేయనున్నట్లుగా వివరించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

వరికుంటపాడు: మండలంలోని సాతువారిపల్లెలో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. యాగశాలలో నిర్వహించిన నవగ్రహ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

సమాధుల స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

జలదంకి: తమ పూర్వీకుల సమాధుల స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని గట్టుపల్లిలోని ముస్లిం కాలనీవాసులు జలదంకి పోలీసు స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తాము పండగల సమయంలో ఈద్గాలో నమాజులు చదువుకుని పూర్వీకుల సమాధుల స్థలంలో ప్రార్థనలు చేస్తామని తెలిపారు. అయితే గ్రామానికి చెందిన దానం ముసలికొండయ్య, దానం అనిల్ స్థలం తమదని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రెండు కార్లు ఢీ

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి టోల్‌ప్లాజా వద్ద శనివారం ముందు వెళ్తున్న కారును వెనుకగా మరో కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు కార్లలోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడగా, కార్లు కొంతమేర దెబ్బతిన్నాయి.

నేడు పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమావేశం

ఉదయగిరి రూరల్: మండలంలోని బండగానపల్లె పంచాయతీ బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. గురువులను సన్మానించడంతో పాటు ఉన్నత పాఠశాల అభివృద్ధిపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నట్లు చెప్పారు. పూర్వ విద్యార్థులందరూ హాజరుకావాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్టంగా రూ.280 ధర పలికింది. వేలానికి 448 బేళ్లు రాగా , 356 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.210, సగటున రూ.251.44 ధర పలికినట్లుగా వేలం నిర్వహణాధికారి జీ రాజశేఖర్ తెలిపారు.

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 391 బేళ్లను తీసుకురాగా, 309 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ. 210, సరాసరిన రూ. 247.81 ధర నమోదైందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

50శాతం సబ్సిడీపై పశువుల దాణా

ఉదయగిరి రూరల్: ఉదయగిరి, గండిపాళెం, కుర్రపల్లి పశువైద్యశాలల పరిధిలోని పాడిరైతులకు రాయితీపై పశువుల దాణాను పంపిణీ చేస్తున్నట్లు పశువైద్యాధికారులు అనూషా, వినయ్ శనివారం తెలిపారు. 50 కిలోల దాణా బ్యాగు ధర రూ.1,110 కాగా, 50శాతం సబ్సిడీపై రూ.555కు అందజేస్తున్నట్లు చెప్పారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన పాడి రైతులు దాణా పొందేందుకు అర్హులని తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్ల క్షేత్రంలో శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం సత్యనారాయణ ఆధ్వర్యంలో వేదపండితులు ఉదయం స్వామివారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గరుడ ధ్వజారోహణం చేశారు. ఈ సందర్భంగా సంతానం లేని మహిళలకు కొడిముద్దలను పంచిపెట్టారు. అనంతరం శేష వాహన సేవను వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా చేజర్ల చలమారెడ్డి, అంకినపల్లి దంపతులు వ్యవహరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంతసేవను నిర్వహించనున్నారు. కాగా ఆలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ లెక్కల చినకొండారెడ్డి, ఈఓ శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

వింజమూరు(ఉదయగిరి): విద్యుత్ సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన తన క్యాంపు కార్యాలయంలో రైతులు, విద్యుత్‌శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. లోఓల్టేజ్, త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, చిన్నపాటి గాలులకే విద్యుత్ సరఫరా నిలిపివేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని విన్నవించారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైనప్పుడు వెంటనే కొత్తది బిగించకపోతుండడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. మెట్టప్రాంత రైతులు బోర్లపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నందున ఎలాంటి సమస్యలు లేకుండా నిరంతరాయంగా 9 గంటల సరఫరాను అందించాలని సూచించారు. సోలార్ విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. జిల్లా విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయన్, ఈఈ ఐ శ్రీనివాసులు, ఏడీఈ కృష్ణమోహన్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి

ఉదయగిరి రూరల్: అప్పసముద్రం పంచాయతీ పరిధిలోని మసీదుపల్లెలో పంచాయతీ నిధులు రూ.4 లక్షలతో చేపడుతున్న వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులకు మాజీ ఎంపీపీ చేజర్ల సుబ్బారెడ్డి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుపల్లెలోని ప్రజలు దూరప్రాంతాలకు వెళ్లి మంచినీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. సర్పంచ్ చేజర్ల నాగరత్న దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించి వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి పంచాయతీ నిధులు రూ.4 లక్షలు మంజూరు చేశారని వివరించారు. ఈ నిధులతో వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు. త్వరితగతిన వాటర్‌ప్లాంట్ నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రజలకు తాగునీరందిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగన్నాథం, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖరరెడ్డి, శ్రీనివాసులు, ఇంజనీరింగ్ సహాయకుడు ఉప్పుటూరి వెంకటేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మేలుజాతి లేగదూడల ప్రదర్శన



జలదంకి: మండలంలోని బోయిలపాడులో మేలుజాతి లేగదూడల ప్రదర్శనను శనివారం నిర్వహించారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనను జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈడీ శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. రైతులు లేగదూడలను సంరక్షించుకుని మేలుజాతి పాడి పశువులుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. దూడలు పుట్టిన వెంటనే ముర్రుపాలు తాగించాలని, 7 నుంచి 10 రోజులకు నట్టల నివారణ మందు ఇవ్వాలని సూచించారు. కాగా రైతులు 46 లేగదూడలను ప్రదర్శించగా కోటా వెంకటేశ్వర్లురెడ్డికి చెందిన దూడ ప్రథమ, గునపాటి మల్లికార్జునరెడ్డికి చెందిన దూడ ద్వితీయ, ప్రభాకర్‌రెడ్డికి చెందిన దూడ తృతీయ బహుమతులు పొందాయి. కావలి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు వైవీ కామేశ్వరరావు దూడల న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కావలి డివిజన్ సహాయసంచాలకులు ఏడీ రసూల్‌సాహెబ్ , బ్రాహ్మణక్రాక ఇన్‌చార్జి పశువైద్యాధికారిణి షబ్నమ్, కొండాపురం పశువైద్యాధికారి ఆలీ, జేవీఓ సామ్రాజ్యం, వీఏ కవిత, గోపాలమిత్రలు, ఏహెచ్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

గంగమ్మ కుంభాభిషేక మహోత్సవాలు ప్రారంభం



ధాన్యాదివాస పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

సంగం: మండలంలోని మర్రిపాడులో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో కుంభాభిషేక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం మండపారాధాన, క్షీరాధివాసం, అష్టగంగాభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, జలాదివాసం, విశేష హోమాలు జరిపారు. సాయంత్రం శాంతి హోమం, ధాన్యాదివాసం నిర్వహించారు. ఆదివారం విగ్రహ ప్రతిష్ట నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చేతిబోరుకు మరమ్మతులు



సీతారామపురం: బసినేనిపల్లిలోని రచ్చబండ వద్ద ఉన్న చేతిబోరు మరమ్మతులకు గురైన నేపథ్యంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలినేని ప్రవీణ్‌కుమార్ శనివారం మరమ్మతులు చేయించారు. చేతిబోరులో అదనపు పైపులు, ఫుట్ బాల్‌ను అమర్చారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని అధికారులు సత్వరమే చేతి బోరుకు మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



ఉదయగిరి: ప్రజలు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని డిప్యూటీ ఎంపీడీఓ కరిముల్లా అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఇళ్లలోని చెత్తను వీధుల్లో పడేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి గ్రీన్‌అంబాసిడర్లకు అందజేయాలని సూచించారు.

బీజేపీ నాయకుల పూజలు

ఉదయగిరి: భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని కాంక్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో ఉదయగిరి శివాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారతదేశంపై దుశ్చర్యలకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు తగిన శాస్తి జరిగేలా చూడాలని దేవుడ్ని ప్రార్థించారు.

25న హనుమాన్ శోభాయాత్ర



హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశంలో కమిటీ సభ్యులు

ఆత్మకూరు: హనుమత్ జయంతిని పురస్కరించుకుని పట్టణంలో ఈనెల 25న హనుమాన్ శోభాయాత్రను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలోని జేఆర్‌పేటలోని వినాయక మండపంలో హనుమాన్ శోభాయాత్ర సన్నాహక సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. శోభాయాత్ర నిర్వహణ బాధ్యతలను పలువురికి అప్పగించారు. భక్తులు అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొనే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన హనుమాన్ భక్తులు శోభాయాత్రలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హనుమాన్ భక్త మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన బైబిల్ శిక్షణ తరగతులు



భక్తిగీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

ఆత్మకూరు: పట్టణంలోని సెంటినరి తెలుగు బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ చంద్రపాల్, కే జయమ్మ, ఆధ్వర్యంలో చిన్నారులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న బైబిల్ శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. చివరి రోజు చిన్నారులు నేర్చుకున్న భక్తిగీతాలను ఆలపించారు. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాన్‌భాస్కర్, నందవరం ప్రసాద్, విజయకుమార్, మరియమ్మ, ఎస్ ప్రతాప్, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల



వింజమూరు మండలం తమిదపాడులో పట్టపగలు వెలుగుతున్న వీధిదీపం

ఉదయగిరి నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో వీధి దీపాలు పగలు,రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. వాస్తవంగా వీధి దీపాల నిర్వహణను పంచాయతీపాలకులు పర్యవేక్షించాలి. కానీ ఎక్కడా కూడా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. దీంతో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతూ విద్యుత్ వృథావడంతో పాటు వీధి దీపాలు త్వరగా మరమ్మతులకు గురై పంచాయతీలపై ఆర్థిక భారం పడుతోంది.

–ఉదయగిరి

దోమల నివారణ మందు పిచికారీ



సీతారామపురం: స్థానిక ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, అయ్యవారిపల్లిలోని వసతి గృహాల్లో దోమల నివారణకు మలాథిన్ ద్రావణాన్ని శనివారం పిచికారీ చేశారు. మలేరియా నివారణకు వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్నట్లు ఉదయగిరి సబ్‌యూనిట్ మలేరియా నివారణాధికారి నౌషాద్ తెలిపారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు వసతి గృహాలకు వచ్చే సమయానికి దోమలు లేకుండా సంసిద్ధం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు., ఎంపీహెచ్‌ఈఓ మజీద్, ఎంపీహెచ్‌ఏలు శేఖర్ రాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా గోదాము



ఉదయగిరి రూరల్: మండలంలోని గంగిరెడ్డిపల్లి సమీపంలో రైతుల సౌకర్యార్థం నిర్మించిన గోదాము నిరుపయోగంగా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు తమ పంట ఉత్పత్తులను మద్దతు ధర వచ్చేంత వరకు నిల్వ ఉంచుకునేందుకు వీలుగా కొట్టాలపల్లి సొసైటీకి అనుబంధంగా రూ.48లక్షలతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదామును నిర్మించారు. ఆ తరువాత ఎన్నికలు రావడం..కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నేటి వరకు గోదామును ప్రారంభించలేదు. గతేడాది కొన్ని నెలలపాటు గృహనిర్మాణ శాఖకు ఇనుము, సిమెంట్ నిల్వ ఉంచుకునేందుకు గోదామును అద్దె ప్రాతిపదికన ఇచ్చారు. ఆ శాఖ ఖాళీ చేయడంతో ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోదాముపై రైతులకు అవగాహన కల్పించి ఉపయోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.